# ప్రజాశక్తి

ఆదివారం 30 జులై 2023

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

## ఉక్కుపై కుట్రలను తిప్పికొడతాం

### మోడీ, అదానీ కుయుక్తులను సాగనివ్వం : వామపక్షాలు వెల్లడి




సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అస్థిరపాలుజేస్తున్న మోడీ, అదానీ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ముందుకు రావాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన శనివారం జగదాంబ దరి సిపిఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఏది లాభం అయితే అది చేస్తామని ప్లాంట్ అమ్మకపు చర్యలను బలపరిచిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి వ్యాఖ్యలను ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. అబద్ధపు ప్రచారాలు కట్టిపెట్టాలని హెచ్చరించింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎంసిపిఐ నాయకులు కె.శంకరరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు కె.దేవా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు వి.కృష్ణారావు, వై.రాజు, జి.పోలేశ్వరరావు, ఈశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా తప్పుడు ప్రచారానికి బిజెపి నూతన అధ్యక్షురాలు పూనుకున్నారని విమర్శించారు. విశాఖకు ఆర్థిక పునాదిగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ బిజెపి అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే చర్యలకు ఉపక్రమించిందన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి విధ్వంసక చర్య నుంచి విశాఖను కాపాడుకోవాలని ప్రజలకు నేతలు పిలుపునిచ్చారు. అదానీతో కేంద్రంలోని బిజెపి సర్కారు కుమ్మక్కయి స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. గంగవరం పోర్టులోకి ప్లాంట్‌కు సంబంధించిన కొకింగ్ కోల్ దిగుమతి చేయకపోవడం, దిగుమతి అయిన బొగ్గును రకరకాల కారణాలు చూపి సకాలంలో ప్లాంట్‌కు చేరవేయకుండా ఆటంకాలు కల్పించడం దారుణమన్నారు. బిజెపి, అదానీ కలిసి ఈ దుర్మార్గ చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో గంగవరం పోర్టు స్టీల్‌ప్లాంట్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా ఉల్లంఘించి బకాయి పేర ప్లాంట్‌కు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తక్షణం గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటి వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 1100 ఎకరాల భూమి ఇచ్చినందుకు ప్లాంట్‌కి సముచిత భాగస్వామ్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్లాంట్‌ను మిగతా 2లో..

## నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి

### ◆ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి ◆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. శనివారం విశాఖ దక్షిణ నియోజకవర్గ సమీక్షా సమావేశం ఆమె అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రజని

నియోజకవర్గంలో వివిధ అంశాలపై చర్చించారు. రెవెన్యూ, జివిఎంసి, నాడు -నేడు, మిగతా 2లో..

## 8న విశాఖకు చంద్రబాబు

### ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై సభలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఉత్తరాంధ్రతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులను అధికార వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గండి బాబ్జీ ఆరోపించారు. శనివారం టిడిపి కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 8న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై పోరాటానికి చంద్రబాబు వస్తున్నారని తెలిపారు. ఆ రోజు మాడుగుల, చోడవరంలలో సభలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. టిడిపి ప్రభుత్వం ఉండగా రూ.780 కోట్లను సుజల స్రవంతికి కేటాయిస్తే, జగన్ ప్రభుత్వం కేవలం రూ.13 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. ఒక్క ఎకరాకు కూడా నీరందించే పరిస్థితి లేదన్నారు. పోలవరం పూర్తయి వుంటే ఎంతో మేలు జరిగేదన్నారు.

### ఉత్సాహంగా మహిళల పోరుయాత్ర

▶ వార్త 4లో..

### స్పోర్ట్స్ ఎరీనా ప్రయివేటుపరంపై ధర్నా

▶ వార్త 2లో..



### పోర్టు భూముల అప్పగింతపై నిరసన

**ప్రజాశక్తి - సీతమ్మధార :** విశాఖ పోర్టు ట్రస్టు భూములను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రహేజా సంస్థకు ధారాదత్తం చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం సాలిగ్రాంపురంలోని విశాఖ పోర్టు భూముల వద్ద నిరసన తెలిపారు. పోర్టు స్థలంలో ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విరమించుకోవాలని సిఎం జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ పోర్టుకు చెందిన వందల కోట్ల విలువ చేసే 17 ఎకరాల భూములను నరేంద్ర మోడీ తన అనుచరుడైన రహేజాకు కట్టబెట్టారని మండిపడ్డారు. అలాగే అక్కయ్యపాలెంలో 16 ఎకరాల్లోవున్న పోర్ట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, కళావాణి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## ఉక్కుపై కుట్రలను తిప్పికొడతాం

దివాళా తీయించే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. అమ్మకపు చర్యలు ఉపసంహరించి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలన్నారు. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను విశాఖ రైల్వే జోన్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ మెట్రో రైల్వే నిర్మాణానికి ఇప్పటికైనా నిధులు కేటాయించాలన్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో అటవీ హక్కుల సంరక్షణ సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా లెక్కచేయకుండా బిజెపి ఆమోదింపజేసుకోవడం దారుణమన్నారు. నూతన చట్టంతో ఆదివాసీలకు అడవిపై హక్కు లేకుండా పోతుందని తెలిపారు. అటవీ హక్కులు, భూములు, గనులు, సంపద మొత్తం కార్పొరేట్ల పరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుష్ట చర్యకు వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమం నిర్మిస్తామని వెల్లడించారు.

## నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి

గడప గడపకు మన ప్రభుత్వం తదితర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ముందుగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి పనులుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో జిఒ 388 ద్వారా 185 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వెయన్స్ డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 169 మందికి కన్వేయన్సు డీడ్ పూర్తి చేశామన్నారు. అల్లిపురం వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన భూముల ఆక్రమిత నివాసదారులకు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సమస్యలు ఉన్నందున వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఆ భూములకు బదులుగా అగనంపూడి, పెద గంట్యాడ మండలంలో 7.32 ఎకరాల భూమి మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సీతారామ స్వామి దేవాలయానికి సంబంధించిన భూములలో ఆక్రమిత దారుల భూమికి బదులుగా దేవాలయానికి భూమి గుర్తించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ దక్షిణ నియోజికవర్గం పరిధిలో విశాఖ పోర్టు వల్ల ప్రజలకు కాలుష్య సమస్యలు అధికంగా వస్తున్నాయని, షెడ్స్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రీనరీని మెరుగుపరచాలన్నారు.

**ఎంవిపి.కాలనీ :** తూర్పు నియోజకవర్గ సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రజని, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. జిఒ నెంబర్ 388 ద్వారా 3267 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వెయన్స్ డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టామని మంత్రి రజని తెలిపారు. అప్పుఘర్ వద్ద మురుగు నీటి శుద్ధి పనుల ప్రాజెక్ట్ పూర్తయినట్లు వెల్లడించారు.




నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

## పోర్టు భూముల అప్పగింతపై నిరసన

ఆడిటోరియంలను కూడా బడా వాణిజ్య సంస్థ పరం చేశారన్నారు. ఈ దుర్మార్గ చర్యలను వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీతో కుమ్మక్కై ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. పోర్టు అభివృద్ధికి లేదా విశాఖ ప్రజల అభివృద్ధికి ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. ఈ విషయమై సిఎం నోరుమెదపకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడటం లేదన్నారు. ఇనార్బిట్ మాల్ వల్ల విశాఖలో ఉన్న వేలాది చిన్న, మధ్య తరహా వ్యాపార, వాణిజ్య సంస్థలు తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు. పెద్దఎత్తున ఉద్యోగాలు పోతాయని గంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు వి.కృష్ణారావు, యుఎస్ఎన్.రాజు, ఆర్ఎన్.మాధవి పాల్గొన్నారు.

## భూ పరిమాణంలో మార్పులు ప్రమాదకరం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** రోజు రోజుకూ భూమి పరిమాణం చిన్నదిగా మారుతోందని, అందువల్ల ప్రకృతిలో అనేక మార్పులు సంభవించి సకల జీవరాసుల ప్రాణాలకూ హాని తప్పదని నగరానికి చెందిన బి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 దశాబ్దాల క్రితం విశాఖ నగరంలో 32 డిగ్రీల వేడి గరిష్టంగా ఉంటే, ఇప్పుడది 40 డిగ్రీలకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు.

# మోసానికి పరాకాష్ట

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

'ఇతరుల కళ్లతో చూసి మన అభిప్రాయాలను మార్చుకుంటే నాశనమే' అన్న ప్రఖ్యాత సామాజిక వేత్త, రచయిత ఫ్రాంక్లిన్ మాటలు నిజం చేసేలాగ బిజెపి నూతన అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి స్వరం మారింది. స్టీల్‌ప్లాంట్ ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేట్ పరం కాదని నిన్న మొన్నటివరకూ ఈ చిన్నమ్మ పలికిన పలుకులు అందరికీ తెలిసినవే. ఒకవైపు జనాలను మోసం చేస్తూ మరోవైపు స్టీల్‌ప్లాంట్ రక్షణకు కట్టుబడి ఉన్నామంటూ పబ్బం గడుపుకుంటూ మొన్నటి వరకూ వచ్చారు. పార్టీ పగ్గాలు చేపట్టిన తరువాత ఆమె గళం మారింది. పెట్టుబడుల ఉప సంహరణ అన్నది కేంద్ర ప్రభుత్వ విధానం అంటూ కొత్తగా ఆమె కనిపెట్టినట్టుగా ఈ నెల 28న విశాఖకు విచ్చేసిన సందర్భంగా మీడియాతోనూ, పార్టీ సమావేశంలోనూ వెల్లడించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ చాపచుట్టేసి అదానీ, అంబానీలకు మోడీ ప్రభుత్వం అప్పచెబుతుందన్న సంగతి ఆమె అవునన్నా ? కాదన్నా ? దేశమంతా తెలిసిందే. ఇంకా ఎంతకాలమూ బూటకపు మాటలతో నెట్టుకెళ్లలేమనుకుని... చిన్నమ్మ స్టీల్‌ప్లాంట్ కథ కంచికే! అన్న అంశాన్ని వెల్లడించారు. వాస్తవానికి ఇన్నాళ్లూ ఆమె వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై (మొదట్లో విం న వ౯)




ఈ కాలంలో మాట్లాడలేదు. కానీ జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలి హోదాలో ఆమె శుక్రవారం విశాఖకు వచ్చారు. ఎంతకాలమూ బుకాయించడం సాధ్యపడని స్థితిలో తాజాగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల సంక్షేమం చూస్తామని, ప్రైవేటీకరణ కేంద్ర విధాన మని' తన అభిప్రాయాన్ని మార్చు కున్నట్టు కనిపిస్తోంది.

**ఒకటా రెండా**

**బిజెపితో విశాఖకు అన్నీ ద్రోహాలే!**

ఒకటా ? రెండా ? ఉత్తరాంధ్ర ప్రజలకు సెంటిమెంట్లుగా నిలిచే వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి పాలకులు చిదిమేశారు. జింక్‌ను మూసేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగారు.

విశాఖకు రైల్వే జోన్ ఇస్తానని భూమి చూపించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టే కోరి తీరా భూమి చూపించాక ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసి ఆదాయానికి గండి కొట్టారు. జోన్‌పై నేటికీ దాటవేత వైఖరినే బిజెపి తీసుకుంది. ఈ విషయాన్ని ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా, విశాఖ నుంచి ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి స్థాయికి వెళ్లిన పురంధరేశ్వరి మరిచారా ? అని పలువురు ఆమెను ప్రశ్నిస్తున్నారు.

# స్పోర్ట్స్ ఎరీనా ప్రయివేటుపరంపై ధర్నా

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద ఎంవిపి కాలనీలోని ఎఎస్ రాజా కాలేజీ గ్రౌండ్ పక్కన ఎకరా పది సెంట్లు విస్తీర్ణంలో రూ.25 కోట్లతో జివిఎంసి నిర్మించిన మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను సహనీ అనే ప్రయివేటు సంస్థకు కట్టబెట్టడాన్ని వార్వా, నివాస్ సంఘాలు వ్యతిరేకిస్తూ శనివారం ధర్నా చేపట్టాయి. ప్రజల ఆస్తులను ప్రయివేటు సంస్థలకు దోచిపెట్టే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని వార్వా జోన్ - 3 కార్యదర్శి కెఎం.కుమారమంగళం డిమాండ్ చేశారు. ఇండోర్ స్పోర్ట్స్‌ను ప్రయివేటు సంస్థకు ఇవ్వకుండా, దీని నిర్వహణ బాధ్యతను జివిఎంసినే చూడాలని, భారీగా విధించిన ఫీజులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జేపీ శర్మ, ఎన్.ప్రకాష్ రావు, డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, జివి.రమణ, లక్ష్మణరావు, కోదండ, రాజు పాల్గొన్నారు.




ధర్నా నిర్వహిస్తున్న వార్వా - నివాస్ నాయకులు

# ఘనంగా శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** టిడిపి విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జి, గీతం విద్యాసంస్థల అధినేత ఎం.శ్రీభరత్ జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మళ్లీ వచ్చే జన్మ దినోత్సవం నాటికి లోక్‌సభ సభ్యునిగా శ్రీభరత్‌ను చూడాలని, అందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోరాడ రాజబాబు, జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



శ్రీభరత్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి గంటా

## రైతులకు అండగా నిలవాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** అందరికీ ఆహారాన్ని అందిస్తున్న కర్షక వృత్తిలోని రైతులకు దేశం మొత్తం అండగా నిలవాల్సిన అవసరముందని యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఆడారి కిశోర్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిన తాను కర్షక దేవోభవ పేరిట కార్యక్రమం చేపడుతున్నానన్నారు

## 5, 6 తేదీల్లో చెస్ పోటీలు

**ప్రజాశక్తి - విశాఖపట్నం :** శ్రీచెస్ అకాడమీ ఆధ్వర్యంలో జానకమ్మలు నాలుగో మెమోరియల్ ఓపెన్ చెస్ పోటీలు అగస్టు 5, 6 తేదీల్లో ఎయు జిమ్నాస్టిక్స్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.30 వేల బహుమతితో ఈ పోటీలు జరుగనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారు పాల్గొనవచ్చునని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు 9989971232 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## విస్తృత గాలింపు చర్యలు

**ప్రజాశక్తి - సీలేరు :** మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నేపథ్యంలో స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన శనివారం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. వాహన తనిఖీలు చేపట్టి వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. అనుమానిత వ్యక్తులపై దృష్టి సారించారు. సీలేరులో అపరిచిత వ్యక్తులు వస్తున్నారా లేదా అని గోప్యంగా ఆరా తీశారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం స్థానిక ప్రభుత్వ కార్యాలయాలకు మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు కలక్కుండా పోలీస్ నిఘా పెట్టారు.

# 'ఉక్కు' ఉద్యమ తీవ్రతరానికి ప్రణాళిక

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా . విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేపట్టిన ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 898వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఇఎండి, ఇఆర్‌ఎస్, సేఫ్టీ, టెక్, ఎస్ఎండి, ఆగ్రో విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ, పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో టెంట్ వేసి ఈ నెల 31వ తేదీ నాటికి 900 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అన్ని నిర్వాసిత కాలనీలు, ఉక్కునగరం, కూర్మన్నపాలెంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. పోరాట కమిటీ సభ్యులు వారి వారి ప్రాంతాల్లో ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు, ఆయా ప్రాంత ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొనేలా చైతన్యం కల్పించాలని కోరారు.

# 11న చలో అడ్మిన్ బిల్డింగ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికులకు నిలిపివేసిన రూ.2400 వెంటనే చెల్లించేందుకు చర్యలు చేపట్టకపోతే ఆగస్టు 11న వేలాదిమంది కార్మికులతో చలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ కార్యక్రమం చేపట్టాల్సి ఉంటుందని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. డబ్ల్యుఆర్ఎం డిపార్టుమెంటు వద్ద జరిగిన హెచ్ఒడి ఆఫీసు దిగ్బంధం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వారం రోజుల్లో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని యాజమాన్యం నిలబెట్టుకోలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు నమ్మి రమణ, కెపి.సుబ్రహ్మణ్యం, చట్టి నర్సింగరావు, నందికి తాతారావు, మురళీకృష్ణ, కోన రమణ, అవతారం, పిట్ట రెడ్డి, పితాని భాస్కరరావు, ఎస్ కృష్ణ సూర్య కుమార్, నమ్మి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఎంఎంఎస్ఎమ్, డబ్ల్యుఆర్ఎం హెచ్ఒడిలకు వినతిపత్రం అందజేశారు.



హెచ్ఒడి ఆఫీసు ముట్టడిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

# 'విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై స్పందన అనవసరం'

ప్రజాశక్తి -గాజువాక : విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించాల్సిన అవసరం లేదని, కేవలం పార్టీ అభివృద్ధిపై మాత్రమే దృష్టి సారించామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా గాజువాక వచ్చిన ఆమె పాత గాజువాక కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చినగంట్యాడ పద్మశ్రీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ప్రముఖుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ నాయకత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు అండగా ఉంటామని చెప్పారు. వారు కోరేవిధంగా కేంద్రానికి తాము కొన్ని సూచనలు చేశామని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల కార్మిక నేతలు ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. కెఎన్ఆర్ ఆధ్వర్యాన పురంధేశ్వరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జివిఎల్.నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మేడపాటి రవీంద్ర, సూర్యనారాయణ రాజు, పుట్టా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రయివేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రయివేటు పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ఆధ్వర్యాన యశోద పబ్లిక్ స్కూల్లో శనివారం ప్రయివేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ సహాయంతో ఎంఇఒ ఎం.సునీత ప్రారంభించారు. పాఠ్యాంశాలపై, నూతన పరీక్షా విధానాలపై శిక్షణ అందించారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు భూషణరావు, దివాకర్, అప్పలరాజు, విశ్వరరావు, అప్పారావు, ఖగేష్, ప్రసాద్, పద్మజ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 600 మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన ఆ సంస్థ ఉద్యోగులు శనివారం పరిశ్రమ ప్రాంగణంలో సుమారు 600 మొక్కలు నాటారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. ప్రపంచ ప్రకృతి దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం జనరల్ మేనేజర్ ఇ.రామకృష్ణ, జిఎం వైఎస్.కోటేశ్వరరావు, ఇసిడి డిజిఎం ఎస్.బాలాజీ, మేనేజర్ ప్రసాద్, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శేఖర్ బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

## పాఠశాల భవనం దుస్థితిపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు రాజీవ్‌మార్గ్, భానోజీ కాలనీలోని సామాజిక భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాల భవనం దుస్థితిపై వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌కు వినతిపత్రం అందించారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలోనే పాఠశాల కొనసాగుతోందని, ఇక్కడికి వచ్చే పిల్లలు, వారి తల్లిదండ్రులు భవనం దుస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారని వివరించారు. సామాజిక భవనంలోనే తరగతులు జరుగుతున్నాయని, ప్రత్యేక గదులు లేక వరండాలోనే కూర్చోవాల్సి వస్తోందని తెలిపారు. పాడైన ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి జి ప్లస్ వన్ తరహా భవనాన్ని పునర్నిర్మిస్తే పాఠశాలకు, సామాజిక అవసరాలకు ఉపయోగపడుతుందని వివరించారు.

## పులులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల జూ ఎడ్యుకేషన్ బృందం ఆధ్వర్యాన శనివారం ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో విద్యార్థులకు అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పులుల సంరక్షణ, వాటి ఆవాసాలు, ప్రవర్తన, వాటి పరిరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వణ్యప్రాణుల పరిరక్షణ దిశగా తదుపరి తరాన్ని ప్రేరేపించడం, పులులు, వాటి సహజ ఆవాసాలను రక్షించడంలో చర్య తీసుకునేలా వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ సిబ్బంది, ఆనంద్ మార్గ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనం కోసం జనసేన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : జనం కోసం జనసేన పోస్టర్‌ను భీమిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల శనివారం ఎండాడలోని కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ల ...గా పరిష్కారం కాని సమస్యలపైనా, నియోజకవర్గంలో అవినీతిపై రాజీలేని పోరాటం చేసేందుకు జనం కోసం జనసేన చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన యువతకు రూ.10 లక్షల రుణ సాయం, ఏటా 5 లక్షల ఉద్యోగాలు, పేదలకు ఇళ్లు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఎన్ఎస్.చంద్రరావు, బివి.కృష్ణయ్య, ఎన్ఎన్.నాయుడు, శాఖరి శ్రీనుబాబు, పోతిన అనురాధ, ఎడ్ల గణేష్ పాల్గొన్నారు.

## అప్పన్న ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శనివారం సెలవు దినం కావడంతో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో సింహగిరి కిటకిటలాడింది. భక్తుల రాకతో పాటు వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రద్దీ కారణంగా క్యూలైన్లో అధిక సమయం భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది

## సాల్ట్‌పై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక దొరతోటలోని ఓ ప్రయివేట్ స్కూల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వృత్తిపరమైన, మూర్తిమత్వంపై సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ఆధ్వర్యాన ఇటీవల ప్రారంభమైన శిక్షణ శనివారంతో ముగిసింది. పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ, ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే శిక్షణా తరగతులకు సార్థకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, బి.శ్రీనివాసరావు, ఎస్.కల్పన, డిప్యూటీ డిఇఒ ఎల్ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈట్ రైట్ మిల్లెట్ మేళా

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాను సిఎండి అతుల్‌బట్ ప్రారంభించారు. ఉక్కునగరం క్లబ్ మల్టీపర్పస్ హాల్లో ప్రారంభమైన ఈ మారథాన్‌లో సుమారు వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతుల్ బట్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ఆరోగ్యకరమైన ఆహార విప్లవం ప్రారంభమైందని, మిల్లెట్ల విలువ ప్రజలకు అర్థమవుతుందని చెప్పారు. మధుమేహం దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల్లో తృణధాన్యాల పట్ల ఆసక్తి పెరిగిందన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుచేసిన 26 స్టాల్స్‌ను సిఎండి ప్రారంభించారు. మిల్లెట్ ఆధారిత తినుబండారాలపై అవగాహన కల్పించారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: బైక్‌పై నర్సీపట్నం వస్తుండగా స్కేటింగ్ స్టేడియం వద్ద శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందినట్లు నర్సీపట్నం టౌన్ పోలీసులు తెలిపారు. నర్సీపట్నం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై వస్తూ స్తంభాన్ని ఢీ కొనడంతో విష్ణు, హరి ప్రసాద్ అక్కడికక్కడే మరణించారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### పెదనరవలో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవలో అగ్ని ప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. నరవ శివారు రెల్లి కాలనీలో మీసాల అప్పలరాజు కుటుంబం నివసిస్తోంది. అప్పలరాజు, భార్య కలిసి శనివారం కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటికి నిప్పు అంటుకుంది. రెండు ఇళ్లు కలిసే ఉండటంతో రెండూ దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో దంపతులిద్దరూ హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అగ్ని హుగుతైపోయాయి. దుస్తులు, రూ.30 వేల నగదు, సామాన్లు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. సర్వం కోల్పోయామని, ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బాధిత కుటుంబం వేడుకుంటోంది. స్థానిక జనసేన నాయకులు వబ్బిన జనార్దన్ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రూ.5000 ఆర్థిక సాయంతో పాటు రూ.2 వేలు విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు.

### బిఆర్‌టిఎస్ రోడ్డులో కారు బోల్తా

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక నుంచి అడవివరం వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో పైనాపిల్ కాలనీ కూడలి సమీపంలో అదుపు తప్పి కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న వారు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు.

## నేడు ఆవు సీతారామయ్య సంతాప సభ

ప్రజాశక్తి -గాజువాక : అరుణోదయ కాలనీలో ఆదివారం సిపిఎం నాయకులు ఆవు సీతారామయ్య సంతాప సభ నిర్వహించనున్నట్లు పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు తెలిపారు. సీతారామయ్య అరుణోదయ కాలనీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, ప్రజా సమస్యలపై నిత్యం పనిచేశారని తెలిపారు. సుందరయ్యకాలనీలో పేదలు పాకల కోసం చేసే ఉద్యమంలో కూడా పాల్గొన్నారని పేర్కొన్నారు. జిఒ 296 ప్రకారం పట్టాలు ఇవ్వాలని చేసిన ఆందోళన పాల్గొన్నారని గుర్తుచేశారు. నవ్వుతూ అందరినీ పలకరించే తత్వం గల సీతారామయ్య మన మధ్య లేకపోవడం బాధాకరమని విచారం వ్యక్తంచేశారు.

## రైతు బజార్‌కు 30 కిలోల పనస పండు

ప్రజాశక్తి- మధురవాడ : కొమ్మాది రైతు బజార్‌కు 30 కిలోల పనస పండు అమ్మకానికి వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డంబ్రిగుడకు చెందిన కొర్ర హుస్సేన్ ఈ పండును బజారుకు తీసుకొచ్చినట్లు రైతు బజార్ ఎస్టేట్ అధికారి జగదీష్ తెలిపారు. సాధారణంగా పనస పండు 10 కిలోల నుంచి 20 కిలోలు ఉంటుందని, ఇది మాత్రం 30 కిలోలు ఉందని పేర్కొన్నారు.

# ఉత్సాహంగా మహిళల పోరుయాత్ర

## విశాఖలో చైతన్యపరుస్తూ సాగిన జాతా

ప్రజాశక్తి-యంత్రాంగం

**మహిళలపై హింస నివారణకు నిపుణులతో అధ్యయన కమిషన్ ఏర్పాటు చేయాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో తలపెట్టిన హింసపై మహిళల పోరు యాత్ర రాష్ట్ర జాతా రెండో రోజైన శనివారం విశాఖ జిల్లాలోని పెందుర్తి మండలంలో ప్రారంభమైంది. అనంతరం ఆనందపురం మండలానికి చేరుకుని అక్కడ నుంచి శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించింది. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పలు అంశాలపై మహిళలను చైతన్యం చేయడానికే ఈ యాత్ర చేపట్టామని తెలిపారు.**

**కలెక్టరేట్ :** మహిళల పోరుయాత్రలో భాగంగా విశాఖ ఉమెన్స్ కాలేజీలో జరిగిన సదస్సులో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, కంచరపాలెం చాణిక్య డిగ్రీ కాలేజీలో జరిగిన సదస్సులో విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా



ఆనందపురంలో గీతాలు ఆలపిస్తున్న బృందం

త్వరితగతిన విచారణ జరిపి, నిందితులకు కఠినమైన శిక్షలు విధించాలని, పోర్న్ వెబ్ సైట్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటుచేసి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, అధ్యక్షులు బి.పద్మ, నాయకులు రమణి, ఆర్.వరలక్ష్మి, కె.మణి, బి.భారతి, డి.కొండమ్మ, ఎ.పుష్ప, బొట్ట ఈశ్వరమ్మ, ఎస్.విజయలక్ష్మి, బి.అనంతలక్ష్మి పాల్గొన్నారు. జాతాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, వర్కింగ్ విమెన్ కో -ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎం.కామేశ్వరి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎం.చంటి మద్దతు తెలియజేశారు. కంచరపాలెం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా జోన్ అధ్యక్షులు కె.అనురాధ ఎం.జయలక్ష్మి, కె.హేమలత పాల్గొన్నారు.

**పెందుర్తి :** పెందుర్తిలో ఐద్వా ఆధ్వర్యాన మహిళల పోరుయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ, కేంద్రంలో



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక

బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలను చైతన్యపరిచేందుకే జాతా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రియాంక, సిహెచ్ రమణి, పూర్ణిమ, జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, అధ్యక్షులు పద్మ, నాయకులు అనంతలక్ష్మి, రమణి తదితరులు పాల్గొన్నారు

**ఆనందపురం :** ఆనందపురం పూల మార్కెట్ వద్ద ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ, మహిళాపై హింసను అరికట్టాలని, మద్యాన్ని నియంత్రించాలని కోరుతూ ఆగస్టు 8వ తేదీన విజయవాడలో చేపట్టే బహిరంగ సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు జానపద గేయాలు, మహిళలపై జరుగు హింసపై పాటల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, పూర్ణ, రమణి, పూర్ణిమ, కె.నాగరాణి, జానపద కళ కారులు, మహిళలు పాల్గొన్నారు.

## ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : రహేజా గ్రూప్ ఆధ్వర్యాన పోర్టు హాస్పిటల్ సమీపంలో ఆగస్టు 1వ తేదీన ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేయర్ హరివెంకట కుమారి, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు.

## సొండి కులస్తుల సమస్యపై వినతి



సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న భారతి, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో సొండి కులస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పాండవ భారతి, శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాండవ భారతి, శ్రీనివాసరావు మాట్లాడుతూ, సొండి కులస్తులకు ఒబిసి, రెండు ప్రత్యేక బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండవ అంబరీష్ కాజల్, ప్రియాంక, సొండి కులస్తులు పాల్గొన్నారు.



కోలా గురువులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ధనలక్ష్మి, శంకర్

## కోలా గురువులుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

**విశాఖపట్నం:** విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులును 18వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పుక్కళ్ళ ధనలక్ష్మి, వైసిపి నాయకులు శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

**గోపాలపట్నం :** డిసిసిబి బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కోలా గురువులుకు సంస్థ ప్రధాన కార్యాలయంలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామినాయుడు, కంపర కోటేశ్వరరావు, గొంతిన నాగరాజు పాల్గొన్నారు.



ఎన్జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన సభ్యులను సత్కరిస్తున్న కెకె.రాజు

## ఎన్జీజీవోస్ కాలనీ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-మాధవధార : నూతనంగా ఎన్నికైన ఎన్జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం జివిఎంసి 49వ వార్డులోని వైభవ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా వైభవ వెంకటేశ్వర స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సమక్షంలో కమిటీ ప్రెసిడెంట్ పార్వతీశం, వైస్ ప్రెసిడెంట్ పి.బలరాంస్వామి, సెక్రటరీ కె.రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీ డిఎస్.కృష్ణమోహన్, డైరెక్టర్లు ఎన్.సాంబశివరావు, ఆర్‌వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాజారావు, వివేక్ స్వరూప్, ఎంవి.స్వరూప్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో 25, 51వార్డుల కార్పొరేటర్లు సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, ఇఇ ప్రసాద్, ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్, 49వ వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీను, శకుంతల, కిశోర్, అప్పలనాయుడు తదతరులు పాల్గొన్నారు.

## గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- గాజువాక : అదాని గంగవరం పోర్టు యాజమాన్యం తక్షణమే కార్మికు సమస్యలు పరిష్కరించాలని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు శనివారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మాట్లాడుతూ, పోర్టు నిర్మాణం కోసం భూములు, సముద్రాన్ని త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస జీతం రూ.36 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం సంప్రదింపులు ద్వారా నిర్వాసిత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. లేదంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ గంటిపిల్ల అమ్మోరు, మాధ అప్పారావు, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన భోగవిల్లి

ప్రజాశక్తి -ములగాడ : ఉపాధి హామీ చట్టం ద్వారా చేసిన పనుల్లో ఆంధ్రప్రదేశ్ నెంబర్-1లో ఉండటంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును రాజీవ్ గాంధీ అగ్రికల్చర్ లేబర్ యూనియన్ అధ్యక్షులు కెవి.నరసింహ రాజు, ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం కలిసి ధన్యవాదాలు తెలిపారు. వంద రోజుల్లో రూ.4,554 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేయించడం, కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు కల్పిస్తున్న 15 కోట్ల పని దినాలను 24 కోట్ల పనిదినాలకు పెంచాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం మంచి పరిణామం అన్నారు. పని దినాలు పెరిగితే 50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో గ్రామీణ ప్రజలతో ఉండి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు రూ.18 వేల జీతం ఇవ్వాలని, పిఎఫ్, సామూహిక బీమా సదుపాయము కల్పించాలని, మండల స్థాయిలో బదిలీలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ నాయకులు సత్యం, ఎర్రిబాబు, అప్పారావు, సన్యాసిరావు పాల్గొన్నారు.



బూడి ముత్యాలనాయుడును కలిసిన నాగభూషణం తదితరులు

## మెడికల్ ఇన్స్యూరెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- ములగాడ : మెడికల్ ఇన్స్యూరెన్స్‌పై హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ సొసైటీ కార్మికులకు శనివారం సంస్థ గేటు వద్ద అవగాహన కల్పించారు. పాలకవర్గ సభ్యులందరూ హాజరైన ఈ సమావేశంలో అధ్యక్షులు ఎన్‌వి.రమణ మాట్లాడుతూ, జీతాలు ఇఎస్ఐ పరిధి దాటినందున అది వర్తించకపోవడంతో కార్మికులు అనారోగ్య సమస్యల విషయంలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీన్ని అధిగమించేందుకు హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఎస్‌బిఐ మెడికల్ ఇన్స్యూరెన్స్‌ను ప్రవేశపెట్టిందని చెప్పారు. దీన్ని కార్మికులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## 'ఉత్తరం' అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు, ఓటరు లిస్టు వెరిఫికేషన్, పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాలు అమలు తీరుపై శనివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, వార్డు వైసిపి అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమన్వయకర్త కెకె.రాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, అందని వారు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, పి.ఉష్రశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకట రమణ, బర్కత్ అలి, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, బల్లా శ్రీను, గురువాజీ, రాఘవులు, తరుణ్, నాయకులు చల్లా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పద్మజ సహస్రకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పూసపాటి పద్మజ సహస్రకు సీతమ్మధార క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యాన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ చెక్కును ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ద్వారా శనివారం ఆయన కార్యాలయంలో విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో 14 వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, క్షత్రియ యూత్ వింగ్ ప్రెసిడెంట్ జి.పృథ్వీరాజు, సెక్రటరీ జి.శ్రవణ్‌వర్మ, కోశాధికారి వి.అభివర్మ, కిరణ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

## 2500 సైకిళ్లను అందజేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్

**ప్రజాశక్తి- అనకాపల్లి**

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చొరవతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న 2500 మంది విద్యార్థినులకు అమర్నాథ్ చేతుల మీదుగా శనివారం సైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణించి ఆపసోపాలు పడుతూ పాఠశాలకు చేరుకునే చిన్నారులకు ఈ సైకిళ్ళు ఎంతో ఊరట కలిగించనున్నాయన్నారు. సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేసి టాటా కంపెనీకి చెందిన 2,500 సైకిళ్లను కొనుగోలు చేసిన అరబిందో ఫార్మా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా స్కూల్ పిల్లలకు ఉచితంగా భోజనం అందజేస్తుందన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఆర్వో ప్లాంట్లు, కళ్యాణమండపాలు వంటివి అనేకం నిర్మించారని అమర్నాథ్ తెలియజేశారు. అనకాపల్లి ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులను ప్రోత్సహించడం కోసం ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ఆనందదాయకమన్నారు. అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నా, తాను సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మీ రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ విష్ణుమూర్తి, మల్ల బుల్లిబాబు, పెద్దిశెట్టి గోవింద, కలగా గున్నయ్య నాయుడు, కోరుకొండ రాఘవ, పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సైకిళ్లు అందజేసి విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్





ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లతో చిన్నారి తశ్వికశ్రీ

## తశ్వికశ్రీకి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

**ప్రజాశక్తి -అనకాపల్లి**

అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన కోమండూరి నరసింహమూర్తి, జ్యోతిల రెండేళ్ల 10 నెలల వయసు గల కుమార్తె తశ్వికశ్రీ ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. అతి చిన్న వయసులోనే తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో పద్యాలు, జాతీయ గీతం, 1 నుండి 20 అంకెలు, 23 జంతువులు, 12 కూరగాయలు, 16 పండ్లు, 12 రంగులు, 6 వాహనాలు పేర్లు, 6 జంతువుల ధ్వనిని అనుకరించినందుకు గాను చిన్నారిని అభినందిస్తూ ఐబిఆర్ ఏప్రిసియేషన్, గోల్డ్ మెడల్‌ను, ఐబిఆర్ బుక్‌ను, గుర్తింపు కార్డును, పెన్,షీల్డ్, 2 ఐబిఆర్ స్టిక్కర్లును బహూకరించారు. చిన్న వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం రావడం చాలా ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



గొర్లి గోపికి, ఎమ్మెల్యేకు గజమాల వేస్తున్న వైసిపి శ్రేణులు

## ఘనంగా గొర్లి గోపి జన్మదినం వేడుకలు

**ప్రజాశక్తి - పరవాడ :** మండలంలోని గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి అమ్మలు కుమారుడు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి గొర్లి గోపి జన్మదిన వేడుకలు శనివారం గ్రామ సచివాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి, శాలువాతో సన్మానించి, వాచ్‌ను గిఫ్ట్‌గా అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, చుక్క రాము నాయుడు, కోన రామరావు, వెన్నెల సన్యాసిరావు పాల్గొన్నారు.

## మంత్రి వల్ల మురికికూపంగా అనకాపల్లి

**ప్రజాశక్తి- అనకాపల్లి :** రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వైఫల్యం వల్లే అనకాపల్లి పట్టణం మురికి కూపంగా మారిందని, అనకాపల్లిని భ్రష్టుపట్టించారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. వెంటనే శంకరంలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు మరమ్మతులు చేప్పట్టాలని, లేకుంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్యే సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరంలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికలలో అనకాపల్లి పట్టణంలో టీడీపీకి మెజారిటీ వచ్చిందనే పట్టణ ప్రజలపై మంత్రి గుడివాడ అమర్నాథ్ కక్ష కట్టారని ఆరోపించారు. శుద్ధి చేయకుండా మురుగు నీరు పంటలకు వెళ్తే పంటలు ఎలా పండుతాయని ప్రశ్నించారు. టీడీపీ హయంలో శంకరం గ్రామంలో 29కోట్ల రూపాయిలతో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ను ఏర్పాటు చేశామని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్లాంట్‌ను పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనివలన పట్టణం మురుగు నీటి మయమై ప్రజలు రోగాలు బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సెల్ఫీ ఛాలెంజ్ చూపుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

# ఐద్వా పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు మాణిక్యం తదితరులు

**ప్రజాశక్తి- అనకాపల్లి**

మహిళల హింసపై ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోరుయాత్ర పోస్టర్లను సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మీ, నాయకులు గుడాల లావణ్య, ఆరిల్లా మణి, పార్వతి శనివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ చిన్నారులు, మహిళలపై హింస రోజురోజుకీ విపరీతంగా పెరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్యం ధోరణితో ఉన్నాయని, ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకు మనం పోరు బాట చేయాలని పిలుపునిచ్చారు. మద్యం, మత్తు పదార్థాలతో యువత జీవితాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఆరోగ్యం నాశనం అవుతుందని, రోడ్డు ప్రమాదాల్లో మరణాలతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మద్యం నిషేధం చేస్తానని వాగ్దానం చేసినా అమలు లేదన్నారు. అధికార ప్రతిపక్షాలు మహిళలపై హింసను నివారించేందుకు తీసుకుంటున్న చర్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో ఈ నెల 31 ఉదయం 9 గంటలకు వచ్చి అనకాపల్లి మార్కెట్, కాంప్లెక్స్ వద్ద సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, అనంతరం కశింకోట, మునగపాక, అచ్చుతాపురం, యలమంచిలి, అడ్డరోడ్డు, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు.

# కార్మికులు ఐక్యంగా పోరాడాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

**ప్రజాశక్తి-అచ్యుతాపురం**

కార్మికులు తమ సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. సిఐటియు అచ్చుతాపురం మండల జనరల్ బాడీ సమావేశం శనివారం స్థానిక క్రైట్స్ కాలేజీ వద్ద జరిగింది. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ ఆశ, అంగన్వాడీ, వీఆర్ఏ, పంచాయతీ, మధ్యాహ్నం భోజనం స్కీం వర్కర్లకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, చిల్లర వర్తకులు, పిఎసిఎస్, ఆటో, బిల్డింగ్, ముఠా కార్మికులకు కనీస వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి పెన్షన్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కష్టపడి పనిచేసే కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, మండల కార్యదర్శి కె.సోము నాయుడు, నాయకులు జయ, మంగమ్మ, సత్యం, సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, సత్యవతి పాల్గొన్నారు.

## నేడు శ్రామిక మహిళ సమన్వయ కమిటీ సదస్సు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** శ్రామిక మహిళ సమన్వయ కమిటీ సదస్సు స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో ఆదివారం జరుగుతుందని, దానిని జయప్రదం చేయాలని సమన్వయ కమిటీ జిల్లా నాయకులు ఎం.నాగ శేషు, సిహెచ్. రూపాదేవి, జి.వరలక్ష్మి, వి.సత్యవతి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ రమాదేవి హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మహిళా కార్మికులు, ఉద్యోగులు పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, తక్కువ వేతనాలు, వివక్షత వంటి అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న మహిళ ఉద్యోగులు కార్మికులు ఎటువంటి చట్టాలు అమలు కావడం లేదని, వీటిపై భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. సంఘటిత అసంఘటిత రంగ మహిళ ఉద్యోగులు, కార్మికులు, ప్రభుత్వ స్కీముల్లో పనిచేసే సిబ్బంది, షాపింగ్ మాల్స్, ఆస్పత్రిలో పనిచేసే మహిళా ఉద్యోగులు హాజరు కావాలని వారు కోరారు.

## ఉపాధి హామీలో దొంగ మస్తర్లపై నిలదీత

**ప్రజాశక్తి-దేవరాపల్లి**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెన్సిల్ మాయాజాలంతో దొంగ మస్తర్లతో చేస్తున్న దోపిడీపై కూలీలు అధికారులను నిలదీశారు. మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఇజిఎస్ కింద 2022-23 ఏడాదిలో రూ.5.42లక్షలు మేరకు జరిగిన పనుల్లో చాలా వరకు అవకతవకలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి అధ్యక్షతన శనివారం ఎంజిఎన్ఆర్జిఎస్ గ్రామసభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కూలీలు ఉపాధి హామీలో అవకతవకలపై నిలదీశారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో మేట్లు, విఆర్‌పిలు కుమ్మక్కై మస్తర్ల దోపిడీకి పాల్పడినట్లు కూలీలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో గ్రామ సభ రసాభాషగా మారింది. వివాదం తారా స్థాయికి చేరుకుంది. దీంతో ఆ గ్రామసభను పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఎంజిఎన్ఆర్జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ డి.ప్రసాద్, డిఆర్‌పి వి.వెంకటేష్ అర్ధాంతరంగా నిలిపివేశారు.



నిలదీస్తున్న ఉపాధి కూలీలు

## 31న అగ్రిగోల్డ్ బాధితుల అర్ధనగ్న ప్రదర్శన

**ప్రజాశక్తి- అనకాపల్లి :** ఈ నెల 31న అగ్రిగోల్డ్ బాధితుల అర్ధ నగ్న ప్రదర్శనను విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వైఎన్ భద్రం, అధ్యక్ష కార్యదర్శులు కరణం మాణిక్యాల రావు, మత్తుర్తి సూరిబాబు పిలుపునిచ్చారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా అనేక దశల ఉద్యమాలు జరిపినప్పటికీ సమస్య పరిష్కారం చేయడంలో విఫలమైన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 31న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బాధితులతో అర్ధనగ్న ప్రదర్శన చేసి, వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి బాధితులందరికీ పరిహారం చెల్లించాలని, లేకుంటే ఆగస్టు 30న విజయవాడ దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.

# శరవేగంగా అంగన్వాడీ భవనాల నిర్మాణం

## ఆర్‌జెడి చిన్మయాదేవి

**ప్రజాశక్తి- కె.కోటపాడు**

జోనల్ పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో 539 అంగన్వాడీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని, శరవేగంగా పనులు జరుగుతున్నాయని ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయాదేవి తెలిపారు. మండలంలోని చంద్రయ్యపేట, ఎడ్లవానిపాలెం గ్రామాల్లో నిర్మిస్తున్న అంగన్వాడీ భవనాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ భవనాల నిర్మాణానికి మూడు రకాలుగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. కొత్తగా పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవనాలకు, పాఠశాల బయట దూరంగా నిర్మిస్తున్న భవనాలకు ఒక్కో దానికి రూ.16 లక్షలు, గతంలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాల మరమ్మతులకు రూ.5 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణలో 143, పాఠశాల బయట 396 భవనాలు నిర్మిస్తుండగా, 376 భవనాలకు మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం సంచుల్లో అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. ఆమె వెంట ఐసిడిఎస్ ఎపిఒ మంగతాయారు, పలువురు సూపర్వైజర్లు పాల్గొన్నారు.



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న చిన్మయాదేవి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

### రివిట్ ఆర్కిటెక్చర్‌తో ఉపాధి అవకాశాలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో రివిట్ ఆర్కిటెక్చర్ నేర్చుకోవడం ద్వారా దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని డైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు అన్నారు. కళాశాలలో స్టూడెంట్ చాప్టర్, ఏపీఎస్ ఎస్‌డిసి ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈనెల 24న ప్రారంభమైన రివిట్ ఆర్కిటెక్చర్ వర్కుషాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక నైపుణ్యతను విద్యార్థి దశ లోనే పెంపొందించుకోవాలని, ఇందుకు అనుగుణంగా భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని వర్క్ షాప్‌లను నిర్వహిస్తామని చెప్పారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ఎన్ రాము మాట్లాడుతూ ఈ వర్కుషాప్ ద్వారా లైసెన్స్ సివిల్ ఇంజనీర్‌గా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. అందుకోసం ప్రతి సివిల్ ఇంజనీర్ ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని కోరారు. డీన్ అకాడెమిక్స్ డాక్టర్ కే.పార్వతి మాట్లాడుతూ డైట్‌లో ప్రపంచస్థాయి విద్యా విధానాలను అవలంభిస్తున్నామన్నారు. బిఐఎం ఇంజినీర్లుగా దేశ విదేశాలలో ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని డైట్ ఐఈఈ కన్వీనర్ వై హేమంత్ కుమార్ తెలిపారు. వర్క్ షాప్ ముగింపు సమావేశంలో ఏపీఎస్ ఎస్‌డిసి ట్రైనర్ దాలి నాయుడుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ ఏ. కృష్ణ నాగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### గొర్లివానిపాలెం గ్రామ సచివాలయం ప్రారంభం

**ప్రజాశక్తి - పరవాడ :** మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీలో సుమారు 50 లక్షల రూపాయల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ శనివారం ప్రారంభించారు. అనంతరం కొత్త గొర్లివానిపాలెంలో రూ.8 లక్షలతో నిర్మించిన సిసి రోడ్, దిబ్బల గొర్లివాన్నిపాలెంలో రూ.5 లక్షలతో నిర్మించిన సిసి రోడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ పాలన సులభతరం కావడమే కాకుండా అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ సచివాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, చుక్క రాము నాయుడు, కోన రామరావు, వెన్నెల సన్యాసిరావు, గొర్లివాన్నిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు పాల్గొన్నారు.

### మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్లను రద్దు చేయాలి

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** వివోఏల మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులను వెంటనే రద్దు చేయాలని వివోఏల జిల్లా అధ్యక్షులు కాగిత సూరిబాబు డిమాండ్ చేశారు మండలంలోని చౌడువాడ శివాలయం వద్ద శనివారం సబ్బవరం క్లస్టర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏలకు తెలంగాణ మాదిరిగా హెచ్ఆర్ అమలు చేసి జీతం పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు అరికట్టాలని, జాబ్ కార్డులు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలం వివోఎల సంఘం అధ్యక్షులు ఎం.నాగభూషణం, కె.కోటపాడు, సబ్బవరం, పరవాడ, దేవరాపల్లి మండలాలకు చెందిన వివోఏలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిఎలు

# వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్

**ప్రజాశక్తి- సబ్బవరం**

అర్హులైన వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ. హేమంత్ అన్నారు. మండలంలోని గుల్లేపల్లి పిహెచ్‌సి పరిధి అమృతపురం సచివాలయంలో జరిగిన జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు , కౌమార బాలబాలికలకు అందుతున్న సేవలను గూర్చి ఎఎన్ఎం పి.పరమేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. కాలానుగుణంగా వేయాల్సిన టీకాలు, ఐఎఫ్ఎ మాత్రలు, కాల్షియం మాత్రలు వేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యం, సుఖ ప్రసవం గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన ప్రసవాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్ద కాకుండా ఆసుపత్రులలో మాత్రమే 100 శాతం ప్రసవాలు జరగాలని, ఆ మేరకు ప్రజలలో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆశా కార్యకర్తలతో ఈ - ఆశ యాప్ గురించి చర్చించి తగు సూచనలు చేశారు. అనంతరం అక్కడి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ హేమంత్

# జగనన్న ఇళ్ల స్థలాల పరిశీలన

**ప్రజాశక్తి-అనకాపల్లి**

మండలంలోని గోలగాం కొండ వాగు ప్రాంతంలో ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో వచ్చిన ఇళ్ల స్థలాలను జనసేన నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వం పేద ప్రజలను మోసం చేసిందన్నారు. చిన్న పాటి వర్షాలకు సైతం నీట మునిగి, వర్షానికి ధ్వంసమయ్యే ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు కేటాయించిందని తెలిపారు. కొండవాలు ప్రాంతంలో స్థలాలు ఇవ్వడం మూలాన వర్షానికి మొత్తం పునాదులు సైతం కొండపై నుండి వచ్చే వర్షపు నీటికి దెబ్బ తింటున్న పరిస్థితి, నాలుగు సంవత్సరాల కాలంలో కనీసం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేని ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, తాడి రామకృష్ణ, అప్పికొండ గణేష్, గంగుపాం జగదీష్, కరణం నాయుడు, సీత, కోన దుర్గ, ప్రసాద్, కాండ్రేగుల ప్రసాద్, లోకేష్, కుమార్, సాయి పాల్గొన్నారు.

**'జగనన్న కాలనీ నిర్మాణంలో నాణ్యత డొల్ల'**

**ఆనందపురం :** ఆనందపురం మండలం తంగుడుబిల్లి గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లేదని జనసేన భీమిలి ఇన్‌చార్జి సందీప్ పంచకర్ల, ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఆరోపించారు. తంగుడుబిల్లిలోని జగనన్న లేవుట్లను శనివారం వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలు పేరుతో ఏర్పాటుచేసిన లేవుట్లలో కనీస మౌలిక వసతులు కల్పించకుండా, నాణ్యతా లోపంతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఎటువంటి ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చంద్రరావు, బివి.కృష్ణయ్య, శాఖరి శీనుబాబు, రాజు నవిరి, కిరణ్ గుడివాడ, దుక్క వెంకంట్, సంతోష్, నానాజీ, నాయుడు, సతీష్ పాల్గొన్నారు.

# పేద విద్యార్థులతో చెలగాటం

**ప్రజాశక్తి-అనకాపల్లి**

విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ రెడ్డి క్షేత్రస్థాయి పరిస్థితి భిన్నంగా ఉందని, ఇంటర్మీడియట్ పేద విద్యార్థులతో చెలగాటమాడుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3500 మంది విద్యార్థులు చేరారని వీరితోపాటు కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ కళాశాలలు కూడా ఉన్నాయన్నారు. ఈ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు అందించవలసి ఉండగా పాఠ్య పుస్తకాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల వైనం బాధాతత్వంగా ఉందని నాగ జగదీశ్ ఆవేదన వ్యక్తపరిచారు. పుస్తకాలు ఉచితంగా ఇవ్వకపోగా వ్యాపారులకు అధిక ఆదాయం సమకూర్చే విధంగా ఇంటర్ బోర్డు అధికారుల తీరు ఉందని నాగ జగదీష్ మండిపడ్డారు. విద్యాశాఖకు కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నామని గొప్పలు చెబుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇప్పటికైనా కళ్ళు తెరిచి బడుగుల పిల్లల పడుతున్న బాధలను గమనించి, వారికి పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్ బుక్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెట్ల హరీష్, వరద మోహన్ కాంత్, కసిరెడ్డి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**ప్రజాశక్తి- అనకాపల్లి**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి కోరారు. ప్రపంచ ప్రకృతి దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా పంచాయతీ కార్యాలయం, రేబాక గ్రామ సచివాలయం వద్ద జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆర్ శిరీష రాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రేబాక సర్పంచ్ మాటూరు సన్యాసమ్మ, శంకరం, బట్లపూడి సర్పంచ్ రామకృష్ణ, సత్యారావు, ఎంపీటీసీ మంత్రి సంతోషం, మాటూరు లక్ష్మణ్, మంత్రి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, శంకరం కార్యదర్శి జయలక్ష్మి, రామకృష్ణ, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి**

ప్రకృతి వ్యవసాయం శాస్త్రీయత పట్ల రైతుల్లో అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్ లచ్చన్న తెలిపారు. మండలంలోని తుమ్మపాల శ్రీనివాస కళ్యాణ మండపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు శాస్త్రవేత్తల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత పొలంలో ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ వేసుకుని 365 రోజులు నిరంతరం ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై రైతు శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తూ, ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రీయత గురించి వివరించాలన్నారు. భవిష్యత్తులో ప్రతినెల 25 వేల నుండి 50 వేల రూపాయల వరకు ఆదాయం పొందాలని సూచించారు. రైతులు కూడ ఇదే విధంగా ఆదాయాలను సంపాదించాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్ కీర్తి గోవింద్, రాష్ట్ర స్థాయి ట్రైనర్స్, మార్కెటింగ్ ఎంటీ.అప్పలరాజు, ఏపీఎం స్వామి నాయుడు, మెంటర్స్, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

### మదర్ ఛారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం

**ప్రజాశక్తి- సబ్బవరం**

స్థానిక మదర్ ఛారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం శనివారం ట్రస్టు కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ఎనిమిదేళ్లగా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టిన ట్రస్టు అధినేత డాక్టర్ వి.సత్యగంగరాజును అభినందించారు. ఈ సందర్భంగా చొక్కాకుల మాట్లాడుతూ ట్రస్ట్ సొంత భవన నిర్మాణానికి తన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సేవా కార్యక్రమాలకు తక్షణ సహాయం కింద రూ.20వేలు అందజేశారు. అనంతరం పేదలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా నాయకురాలు డి.పద్మావతి, ట్రస్ట్ డైరెక్టర్లు పి.శ్రీనివాసరావు, పి.తారకేశ్వరి, రమేష్, విలియం కేరి, మౌనిక, సుశీల, పల్లా రమణ పాల్గొన్నారు.



# గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు

**- అనకాపల్లి ఎస్‌పి మురళీకృష్ణ - చెక్ పోస్టు పరిశీలన**

**ప్రజాశక్తి-గొలుగొండ:**మన్యం ప్రాంతం నుండి మైదాన ప్రాంతాలకు గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పడక్భందీ చర్యలు చేపడుతు న్నామని, ఇందుకోసం నిరంతర నిఘా ఉంచామని జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం పోలీస్ చెక్ పోస్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి రవాణా అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరంగా చేపడుతు న్నామన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేయబోయే చెక్‌పోస్టు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఏఎల్‌పురం లోని మైత్రి గంద్రాలయాన్ని సందర్శించారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ కావాలంటే తనను సంప్రదించాలని గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు పల్లి సత్యనారాయణ, పోతల శ్రీరామ్మూర్తి, గాడి అప్పలనాయుడు, వాసు, నాగేంద్ర రాజు తదితరులు ఎస్పీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, సిఐ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


చెక్‌పోస్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

## రెండో విడత రీ సర్వే

**- తహశీల్దార్ కె.వరహాలు**



**ప్రజాశక్తి-రోలుగుంట:**మండలంలో రెండవ విడత రీ సర్వే పనుల్లో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారని మండల తహశీల్దార్ కె.వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిబి.పట్నం, బిజి.పేట, రత్నంపేట, గంగవరం, గుర్రంపేట, కంచుగుమ్మల పంచాయతీ గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. డిప్యూటీ తహీల్దార్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వారు బదిలీపై వెళ్లారని, వారి స్థానంలో ఇంకా ఎవరు రాలేదన్నారు. ఆ పోస్టులు భర్తీ అయితే సర్వే పనులు మరింత వేగవంతం అవుతాయన్నారు. మొదటి విడత రీ సర్వే పనుల్లో ఈ మండలానికి మంచి గుర్తింపు వచ్చిందని, రెండవ విడత కూడా వేగవంతం చేసే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.


మృతి చెందిన కోళ్లు

## కుక్కల దాడిలో 18 నాటుకోళ్లు మృతి

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని చోద్యం గ్రామానికి చెందిన సప్పా నారాయణరావు ఇంటి వద్ద కుక్కలు నాటుకోళ్ళపై దాడి చేశాయి. దీంతో 18 కోళ్లు మృత్యువాత పడ్డాయి.సుమారు రూ.35 వేలు పైబడి నష్టం వాటిల్లిందని నారాయణరావు వాపోయాడు.

## విశ్రాంత విఆర్‌ఒ మృతి

**ప్రజాశక్తి-మాడుగుల:**ఎం.కోటపాడు గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్‌ఓ బొడ్డపాటి శ్రీరామ మూర్తి (పెద్ద రాము) శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. ఆయన గతంలో కాంగ్రెస్ పార్టీ నేతగా గ్రామానికి సుపరిచితులు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగాను, వీఆర్వో సంఘం అధ్యక్షులు గా, విశాఖ డైరీ డైరెక్టర్‌గా పలు పదవులు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఒకే ఒక ఎంపిటిసిగా గెలుపొంది, వైసిపి లో చేరారు. ఆయన భార్య ఇటీవల మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మండలంలోని పలువురు నేతలు శనివారం ఆయన ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు.

## ఎరువుల తయారీపై అవగాహన

**ప్రజాశక్తి -రావికమతం:**రావికమతంలో గెంజి గోవిందు కల్లాల వద్ద అజోల్లా ఎరువులు తయారీపై ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి గుణవతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అజోలా ఎరువును వాడటంతో వరిలో కలుపు రాకుండా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నత్రజని శక్తి కూడా ఎక్కువగా ఉండటంతో వరి మంచిగా ఎదుగు తుందన్నారు.చీడ పీడలకు తావివ్వకుండా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రసాయనక ఎరువులను వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు గాను ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు.


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి

## ఇళ్ల నిర్మాణంపై బహిరంగ చర్చకు సిద్ధమా?

**ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:** నియోజకవర్గంలో ఈ నాలుగేళ్ల కాలంలో ఎన్ని ఇళ్లు పూర్తి చేశారో ఎమ్మెల్యే గణేష్ బహిరంగ చర్చకు రావాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర సవాల్ విసిరారు. శనివారం మున్సిపాలిటీలోని జగనన్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, వర్షం కురిస్తే జగనన్న కాలనీలు బురదమయంగా మారుతున్నాయన్నారు. భవన నిర్మాణ సామగ్రి తీసుకురావడానికి వాహనాలు తిరిగే పరిస్థితి లేదన్నారు. మున్సిపాలిటీలో 2300 ఇళ్లు ఇస్తే కనీసం 200 కూడా పూర్తి కాని పరిస్థితి ఉందన్నారు. పేదవాడికి ఇళ్ల స్థలాలు పేరుతో కోట్ల రపాయలు దోచుకొని ప్రజలను నట్టేట ముంచారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 2వ వార్డు ఇన్చార్జ్ మొండెం శివ, వాసం వెంకటేష్, బంగారు నాయుడు, నమ్మిన మంగరాజు, శివ, కొప్పాక కళ్యాణ్, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ. నాతవరం యూత్ అధ్యక్షులు బైన మురళీ, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్ పాల్గొన్నారు.

## 17 నుంచి బస్సు యాత్ర

**ప్రజాశక్తి -రావికమతం:** దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అనకాపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు. మండలంలో మేడివాడ గ్రామంలో శనివారం సిపిఐ మండల కార్యదర్శి జోగిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, ఆగస్టు 17వ తేదీ నుండి నిర్వహించే బస్సు యాత్రను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. మణిపూర్‌లో ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు ఈ ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. 19న అనకాపల్లిలో జరుగు బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్ క్రాంతి కుమార్, మండల సమితి సభ్యులు జోగారావు, సేనాపతి శ్రీను, బుంగ కుమారి, పి.శ్రీను, ఈశ్వరరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

## 599వ రోజుకు మత్స్యకారుల ఆందోళన

**ప్రజాశక్తి-నక్కపల్లి :**హెటిరో కంపెనీ రెండవ పైపులైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 599వ రోజుకు చేరింది. శిబిరం వద్ద శనివారం మత్స్యకారులు పైప్ లైన్ కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పైపులైనుకు వ్యతిరేకంగా తామంతా 599 రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే తమ భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి వదలడంతోమత్స్య సంపద నశించి ఉపాధి కోల్పోవడం జరిగిందన్నారు.తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ పైప్ లైన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వ కూడదని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసాల స్వామి, భూలోక పాల్గొన్నారు .


ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

## పోరాటం ఉధృతం : సిపిఎం

**ప్రజాశక్తి -కోటవురట్ల:** గిరిజన ప్రాంతమైన అణుకు గ్రామ సమస్యలపై ప్రభుత్వం స్పందించక పోతే పోరాటం ఉదృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు తెలిపారు. 23వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వడంతో మండల స్థాయి అధికారు లంతా సమస్యలను జిల్లాస్థాయి అధికారులకు నివేదించినా ఎటువంటి స్పందన లేదన్నారు. తక్షణమే స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, నానాజీ, సన్యాసిరావు, సూరిబాబు, రమేష్, కామేష్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


అన్న సమారాధనలో భక్తులు

## వెంకన్న ఆలయం కిటకిట

**ప్రజాశక్తి -నక్కపల్లి :**ప్రసిద్ధి పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకటలాడింది. అధిక శ్రావణమాసం సందర్భంగా ఉమ్మడి విశాఖ, కాకినాడ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు పర్యవేక్షణలో దాతల సహకారంతో ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం నాడు సుమారుగా 800 మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు పాల్గొన్నారు.

## ఓటర్ వెరిఫికేషన్‌ను పర్యవేక్షించాలి

**- మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు**

**ప్రజాశక్తి - చీడికాడ:**మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం అడవుల అగ్రహారంలో బూత్ ఏజెంట్, ముఖ్య నాయకులతో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై మాడుగుల తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న బూత్ ఏజెంట్లు బి ఎల్‌వోలతో కలిసి ప్రతి ఇంటి వెళ్లి ఓట్ల స్థితిగతులు తెలుసుకొని, ఒకవేళ ఓట్లు రద్దయితే వారిని తక్షణమే చేర్పించేటట్లు చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కలిగించే విధంగా సంబంధిత పత్రాలను నింపి అధికారులకు అందజేసి ఓట్లు వచ్చేటట్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, మాజీ సర్పంచ్ మైచర్ల నానాజీ, వైస్ సర్పంచ్ గుంపాన ధర్మయ్య, కార్యదర్శి చెల్లయ్య, యువత అధ్యక్షులు రామగోవింద, పాల ప్రెసిడెంట్ గుంపనా చిన్న సత్యారావు, మాజీ పాల ప్రెసిడెంట్ పడాల ఈశ్వరరావు, వరాహపురం రమణ, సింగవరం గ్రామ అధ్యక్షులు శరగడం శివ, కోన అప్పారావు, ఫాల్గుణ, బూత్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## మినీ పశువుల వ్యాన్లు పట్టివేత

**ప్రజాశక్తి -నక్కపల్లి:**ఎలమంచిలి నుంచి తుని వైపు రెండు మినీ వ్యాన్లులో తరలిస్తున్న పశువులను శుక్రవారం అర్ధరాత్రి కాగిత టోల్ గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. రెండు వ్యాన్ లలో 21 పశువులను స్వాధీన పరుచుకుని సింహాచలం గోశాలలకు తరలించామని, రెండు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసామని పోలీసులు వెల్లడించారు.



ఎంపికైన నింజాస్ అకాడమీ క్రీడాకారులు

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ గ్రప్లింగ్ పోటీలకు నింజాస్ అకాడమీకి చెందిన 17 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 29 నుండి 30 వరకు అనకాపల్లి జిల్లా రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న పోటీలలో నింజాస్ అకాడమీ సబ్ జూనియర్, సీనియర్ పోటీలకు 17 మంది ఎంపికైనట్లు నింజాస్ అకాడమీ ఛైర్మన్ వెలగా నారాయణరావు తెలిపారు. 20 కేజీల నుండి 100 కేజీల వరకూ పోటీలలో వెయిట్ కేటగిరీల ఉంటాయని తెలిపారు. వీరికి డైరెక్టర్ పారుపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్, సీనియర్ కోచ్ యర్రా శేఖర్, శాప్ కోచ్ అబ్బులు అభినందనలు తెలిపారు.



జెసిబితో చేపడుతున్న గ్రావెల్ తవ్వకాలు

## అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని అమ్మపేట గ్రామంలో డి పట్టా కొండపోడు భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా స్పందించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామానికి సమీపంలో గతంలో ప్రభుత్వం కొంత మందికి డి పట్టా భూములను మంజూరు చేసింది. కొండనుకొని సాగు చేసుకుంటున్నా ఈ భూముల్లో అనుమతులు లేకుండా కొండను తొలిచి గ్రావెల్ వేలాది రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించు కోలేదు. తవ్వకాలు జరుగుతున్నాయని కొంతమంది గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని పలువురు ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

## విఒఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి, సిబిఓ హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్ల) రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్. రూపాదేవి కోరారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద విఓఎల సంఘం (సిఐటియు ) ఆధ్వర్యంలో శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్. రూపాదేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో వెలుగులో పని చేస్తున్న విఓఎలు అనేక ఏళ్ళుగా పని చేస్తున్నా, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను తీసుకొచ్చి, తొలగింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తెలంగాణ మాదిరిగా సిబిఓ హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేసారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, విఓఎల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి, ఉద్యోగ భద్రతా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమలో విఓఎల మండల నాయకులు వెంకట లక్ష్మి, వరహాలబాబు, రామలక్ష్మి, కమల, జ్యోతి, చిట్టమ్మ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి - విశాఖపట్నం:విశాఖ జిల్లాలోని జగదాంబ, వన్‌టౌన్, గాజువాక, ఫకీర్ తక్యా, ఇస్లాంపేట తదితర



వన్‌టౌన్‌లో వేడుకలు నిర్వహిస్తున్న ముస్లిములు

ప్రాంతాల్లో ముస్లిం సోదరులు మొహరం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు ఆచరించారు. ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు.

**నక్కపల్లి:**మండలంలోని ముస్లిం గ్రామాల్లో శనివారం మొహరం వేడుకలను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద బోదిగల్లం, అప్పుల పాయకరావుపేట, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో మొహరం పర్వదినం పురస్కరించుకొని గుమ్మటాలను వస్త్రాలతో అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ముస్లిం సోదరులు మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ముస్లిం గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.



నక్కపల్లిలో ఊరేగిస్తున్న ముస్లిములు

# మణిపూర్ మారణకాండపై నిరసనలు



ఆందోళన చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మణిపూర్ రాష్ట్రంలో మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు గౌరవ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు కోరారు. శనివారం సాయంత్రం యస్ రాయవరం మండలం తిమ్మాపురం శ్రీ నూకాలమ్మ ఆలయం వద్ద జరిగిన ఐదు మండలాల ఐకెపి సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఐకెపి సభ్యులు మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ, మణిపూర్‌లో గడచిన మూడు నెలలుగా హింసాకాండ జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి, జిల్లా నాయకుడు రాజేష్, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు యమ్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్:** మణిపూర్‌లో ఘటనలకు నిరసనగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశం బిఎస్‌పి పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జ్ బొట్టా నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ, మణిపూర్ దుర్మార్గాన్ని ఖండిస్తూ బాధితులకు సంఘీభావంగా నిరసన తెలిపారు. మణిపూర్‌లో రెండు నెలలకు పైగా జరుగుతున్న హింసకాండను అక్కడి బీజేపీ ప్రభుత్వమే నడిపిస్తుందని విమర్శించారు. భూమి, వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురి చేయడానికి బిజెపి ప్రభుత్వం నడిపిస్తున్న నాటకం అనితెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీసాల సుబ్బన్న, సిపిఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, సిపిఎం నాయకులు అడిగర్ల రాజు, ప్రజా బంధు పార్టీ నాయకులు ప్రసాదు, బహుజన ఐక్యవేదిక నాయకులు కొల్లి గంగాధర, ఐద్వా సభ్యులు గౌరీ, కెవి సూర్యప్రభ, త్రిమూర్తులరెడ్డి, గురు బాబు, సాపిరెడ్డి నారాయణమూర్తి, విధసం నాయకులు ఎల్లాజీ,. రమణ, రాధాకృష్ణ, మైనార్టీస్ సంఘాల నాయకులు సువర్ణ రాజు, సూరిబాబు, పాపారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**పరవాడ :** మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్న సంఘం విద్రోహ శక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు రమణి మాట్లాడుతూ మే 4న



నర్సీపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నేతలు





పరవాడలో నినాదాలు చేస్తున్న నాయకులు, మహిళలు

మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి, నగ్నంగా తీసుకెళ్లి, సామూహిక అత్యాచారాలు చేసి, హత్య చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు అక్కమ్మ, లక్ష్మి, భూలక్ష్మి, పార్వతి, కనక, రత్నమాల, దేవి పాల్గొన్నారు

**చోడవరం :** మణిపూర్ మారణకాండకు నిరసనగా చోడవరం మండల క్రిస్టియన్లు చర్చిల ఆధ్వర్యంలో శనివారం చోడవరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో ఎస్టి గిరిజన జాతులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ జీవన్ పాల్, అనంతకుమార్, అబ్రహం, మహిళలు పాల్గొన్నారు.

**తగరపువలస :** సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన స్థానిక ప్రయివేట్ మార్కెట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి కానూరి రాంబాబు, అల్లు బాబూరావు, మొర అప్పలరాజు, మావూరి వీర్రాజు, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు చిట్టివలస వెల్ఫేర్ సెంటర్ నుంచి ప్రైవేట్ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు

**పెందుర్తి :** మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొల్పాలంటూ సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) పెందుర్తి ఏరియా కమిటీల ఆధ్వర్యాన చినముషిడి వాడ జంక్షన్ నుంచి సుజాతనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రమణి, ఆర్ శ్రీనివాస్, నిర్మల, వై.రాంబాబు, అసిరి నాయుడు, అన్నపూర్ణ, అప్పలనాయుడు, రజిని, రూప, వరలక్ష్మి వామపక్షాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# 31న ధర్నాను జయప్రదం చేయాలి

### మిడ్డే మీల్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

ప్రజాశక్తి -నక్కపల్లి :మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 31న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని మిడ్ డే మిల్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. మిడ్డేమిల్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నక్కపల్లి నూకాలమ్మతల్లి గుడి వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో వరలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై పనిభారంతో పాటు, వేదింపులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ విలీనం పేరుతో వందలాది మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు పెంచడంతో పాటు పని భద్రత కల్పించాలని, వంటకు ఉపయోగించే వంట పాత్రలు సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు కేటాయించి, 10 నెలలకు కాకుండా 12 వేతనాలు ఇవ్వాలని కోరారు.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు లోకలక్ష్మి, రత్నం, మణి, రమణమ్మ, మహాలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారమే రోడ్డు విస్తరణ

### ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక మున్సిపాలిటీ 24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ, రోడ్ విస్తరణపై అపోహలు వద్దని తెలిపారు.చట్ట ప్రకారం రోడ్ విస్తరణ చేస్తామని చెప్పారు. కోర్టు కూడా రోడ్ విస్తరణ వద్దని చెప్పలేదని తెలిపారు.కోర్టు ఆదేశాల మేరకే నడుచుకుంటామని చెప్పారు.టీడీఆర్ బాండ్స్ కు భవన యజమానులు అంగీకరిస్తే ఆ ప్రకారం ముందుకు వెళ్తమని.. లేదా భూసేకరణ ద్వారా రోడ్ విస్తరణకు ముందుకు వెళ్లమని కోర్టు చెప్పిందని వివరించారు. అనంతరం ఆయన వార్డ్‌లో పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, గడపగడపలో ఇచ్చిన హామీలకు సంబంధించి రూ.2 కోట్లు విడుదల అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, 24వ ఇంఛార్జి టౌన్ వైఎస్ఆర్ అధ్యక్షుడు ఏక శివ, 23వ ఇంఛార్జి కణితి అన్నపూర్ణ, కణితి వాసు, ఏరియా.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ రాజుబాబు, పెట్ల నాయుడు, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి, అయ్యరక కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, కో ఆప్షన్ కౌన్సిలర్ షేక్ రోజా, లగుడు స్వామి, వైసిపి మహిళ విభాగం టౌన్ అధ్యక్షురాలు గణమ్మ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నర్సింహామూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శారద, దనిమిరెడ్డి ప్రసాద్, నాగు పాల్గొన్నారు.

